# అనామకుడి మహాప్రస్థానం

దుత్తా దుర్గాప్రసాద్

కథానిక

మనుష్యుల్లో మూడు వర్గాలున్నాయి. ఒకరకం, జీవితంలో గొప్ప విజయాల్ని సాధించి అపారమైన ఐశ్వర్యాన్నో, అనంతమైన కీర్తినో, లేక రెండింటినో, ఆర్జించి, ప్రపంచాన్నుంచి తరలిపోతారు. మరోరకం అడుగడుగునా అపజయం పొంది, జీవితంమీద విరక్తిచెంది, ఆత్మహత్య చేసుకునో, అంతకంటే అన్యాయంగానో చనిపోతారు. సాధారణంగా ఏ జీవిత చరిత్ర చదివినా, యీ రెండు వర్గాల మనుషులే కన్పించుతారు మనకి. కాని మరో వర్గముంది. అసలు మెజారిటీ దీనికి చెందుతారు. చెప్పుకోదగ్గ ఏ విధమైన సంఘటనలూ ఉండవు వీళ్ళ జీవితంలో. వీళ్ళని చాలా మంచివాళ్ళనిగానీ, మరీ చెడ్డవాళ్ళనిగానీ చెప్పలేం. ఏదో పుడుతారు, పరిస్థితులెలా ఆడిస్తే అలా ఆడి వెళ్ళిపోతారు. వీళ్ళ చరిత్ర రాయాలిసిన అవసరంగానీ, రాసేవాళ్లుగానీ ఉండరు. ఒకవేళ ఎవరన్నా రాసినా చదివేవాళ్ళు దొరకడం కష్టం.

కాని నా కర్మవశాన ఆ మూడోరకం చరిత్రనే రాయవలసి వచ్చింది! ఇందులో ప్రతి అక్షరమూ నన్ను వెక్కిరిస్తూనే ఉంది. "పాఠకులు ఇలాంటి చెత్తరచనలు చదువుతారా?" అని. అయినా రాయవలసిన బాధ్యత నామీద వుంది. ఎలా ఉందంటే—

మా "హాస్టలు మేట్స"ందరికీ కాతా కొట్టు అది. పద్దు ఎంతయినా కానీండి. యిచ్చిందాకా అడగడు అతను. ఎంతో ప్రేమగా పలకరిస్తాడు అందర్నీ. ఏవేవో కబుర్లు చెప్తుంటాడు. వాటిల్లో అర్థం ఉండకపోయినా తమాషాగా ఉంటాయి. ముఖ్యంగా నేను తీరికదొరికినప్పుడల్లా అతని దగ్గరికెళ్ళి కూర్చుని కబుర్లు వింటూ ఉంటాను.

ఒకనాడు అడిగాడు "బాబూ, మీరు కథలు రాస్తారట నిజమేనా?" అని.

"ఆ, రాయడం వరకూ నిజమే!" అన్నాను, రాయడానికీ, అచ్చువడానికీ తేడా ఉందన్న సంగతి అతనికి తెలియనందుకు నవ్వుకొంటూ.

"అయితే నాకథ రాయగలరా?" అన్నాడు. నాకేదో తమాషాగా అడుగుతున్నాడనిపించింది. "ఏమని రాయమంటావు?" అన్నాను నవ్వుతూ.

దాంతో కూర్చోబెట్టి, ఏదో డైరీలో తేదీలూ జన్మనక్షత్రమూ, అదీ యిదీ చూపిస్తూ "నే వెళ్తాను బాబోయ్" అంటున్నా వదలకుండా నా దుంప తెంపి వదిలాడు రెండున్నర గంటలసేపు. అతనంటే అదోరకమైన అభిమానంవల్ల వింటూ కూర్చున్నాను.

లేచివస్తోంటే "ఏం బాబూ, రాస్తారుకదూ?" అన్నాడు.

"సరేలే" అన్నాను అతని అమాయకత్వానికి నవ్వుకొంటూ. మా "రూమ్ మేట్"కి వాళ్ళకీ యీ సంగతి చెప్పేసరికి పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వారు.

కాని ఇది జరిగిన వారంరోజులకి ఆ దారిని వస్తుంటె అతను చనిపోయాడన్నారెవరో! పరుగెత్తుకొంటూ వెళ్ళాను కొట్టుదగ్గరికి. గుండెలు బాదుకొంటూ ఏడుస్తోందతని భార్య.

కొట్టు చెక్కకి తల ఆనించి అలా పడిఉన్నాడతను. కళ్లు మూసీ మూయనట్టున్నాయి. "బాబూ నాకథ రాయరూ" అని అడుగుతున్నట్టనిపించింది నాకు.

* * *

1894వ సంవత్సరం ఫిబ్రవరి పదమూడో తేదీన ఉదయం 5-25కి, గుంటూరు జిల్లాలోని "చీరాల"కు ఉత్తరంగా మూడు మైళ్ళలో ఉన్న ఒక చిన్న పల్లెలో ఒక తాటాకు కప్పిన యింట్లో ఒకజీవి మొదటిసారిగా కళ్లు తెరిచి, కూలిపోనున్న కప్పునీ, దాని కంటుకొని వ్రేలాడుతోన్న బూజునీ చూచి "అమ్మా" అని అరిచి 'గమ్మ'న ఊరుకొన్నాడు, యిక్కడ అరిచినా లెక్కపెట్టే వాళ్లెవరూ లేరని తెలుసుకొని. ఆ సమయంలో ఆకాశంలో దట్టంగా మేఘాలు కమ్ముకొలేను.

అప్పటినుంచీ కాంగ్రెసోళ్ళంటే ఒళ్ళుమంట సంజీవయ్యకి. అతనికి తగ్గట్టు వాళ్ళ ఎస్ ఇన్స్పెక్టరూ అలాంటివాడే! ఖద్దరుటోపీ పెట్టుకొన్న వాణ్ణల్లా పట్టుకొచ్చి జైల్లోపారేసే రోజులవి. లాఠీలతో ఒళ్లు హూనంచేస్తూ, గుండుసూదులు వేళ్ళల్లోకి గుచ్చుతూ, వాళ్ళు స్టేషనుదద్దరిల్లిపోయేటట్టు అరుస్తుంటే, తమ నరసయ్యపంతులుమీద పగతీర్చుకొంటున్నాను గదా అని సంతోషించేవాడు!

అతని ప్రభుభక్తికి మెచ్చి, ప్రభుత్వం అతనికి ప్రమోషనిచ్చింది. హెడ్ కానిస్టేబులయ్యాడు సంజీవయ్య.

1922 మే 15వ తేదీన అతనికి పెళ్ళయింది. ఏదో వాళ్ళ అమ్మ బలవంతాన చేసుకొన్నాడు గాని, అసలతనికి పెళ్ళంటే యిష్టంలేదు. అయినా పెళ్ళయిందతనికి. ఏడాదితిరక్కుండానే కొడుకు పుట్టాడు.

1930లో వాళ్ళ అమ్మ పోయింది. తేదీ గుర్తుంచుకోవలసినంత ముఖ్యమైన సంఘటనగా భావించలేదతను. అప్పటికే అతనికి నలుగురాడపిల్లలూ, యిద్దరు మొగపిల్లలూ! వాళ్ళతో బాధపడటంతోటే సరిపోయేదతనికి. "తల్లిని గౌరవించి సేవించాలి" అని అనుకొనేంత సున్నితత్వాన్ని కోల్పోయిందతని మనస్సు

ఆతర్వాత అతనికి మరి ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. అంటే మొత్తం తొమ్మిదిమంది పిల్లలతనికి. యిద్దరు మొగవాళ్ళూ ఏడుగురు ఆడవాళ్లూను. మనిషి యాభయ్యోపడిలో పడుతున్నా చెక్కుచెదరకుండా "ఉక్కుముక్క"లా ఉన్నాడు! అయితే ముఖంలో ముడతలుకనిపిస్తూ ఏమంత ఉత్సాహంగా ఉన్నట్టు కనిపించడు. ముగ్గురు ఆడవాళ్ళకి పెళ్ళిళ్లయిపోయాయప్పటికే. అల్లుళ్ళుకూడా తనకి తగినవాళ్ళే దొరికారు. ఒక అతను రైల్వేలో పోర్టరు. రెండోవాడు పోస్టల్లో "మెసెంజరు". మూడోవాడు కోర్టు జవాను. అతని పెద్దకొడుకు కూడా కానిస్టేబులుగానే చేరాడు. రెండోవాడు సెకండ్ ఫారమ్ చదువుతున్నాడు. మిగిలినవాళ్ళు ఆడపిల్లలు.

సంజీవయ్య చాలా బాధపడిపోతున్నాడు. యుద్ధంరోజులసలే! ఎండ డబ్బూ యిట్టే హరించిపోతూంది. 'తెలివి'గా సంపాదించుకోగల శక్తి లేదతనికి. ఎవరైనా బలవంతంగా జేబులో పెడితే తీసుకోడంతప్పు!... భోజనంకూడా ఒంటిపూటే. ఒంటిపూట జొన్నరొట్టెలూ, అవీ కాల్చుకు తింటున్నారు. ఏదో తాతలనాటి యిల్లు అమ్మబట్టిగాని లేకపోతే ఆ ఆడపిల్లలకి, పెళ్ళిచేయడం కూడా అసంభవమైనదే.

స్వతంత్రంవచ్చింది. తాను లాఠీలతో మోదిన ఖద్దరుటోపీవాళ్లంతా పూలదండలేసుకొని కార్లలో తిరుగుతున్నారు. సంజీవయ్య భయంతో వణికిపోతున్నాడు ఉన్న ఆ కాస్త ఉద్యోగమూ ఊడిపోతే రోజులెలా గడపాలోనని.

అయితే అతను భయపడినదానికి భిన్నంగా జరిగింది. కొంతమంది స్థానిక నాయకులు సంజీవయ్యని తీసేయించాలని పట్టుబట్టినా, బాధ్యతగల పెద్దలు 'అతను చేసింది ప్రభుసేవనీ', 'అంతకన్నా ఆ వుద్యోగంలోవుండి అతను చేయదగిందేదీ లేద'ని చెప్పి సర్వీసు యింకా రెండేళ్లు పొడిగించారు. ఆరోజున "కాంగ్రెసోళ్ళంటే దేవుళ్ళు" అనుకొన్నాడు సంజీవయ్య. ఇంకెప్పుడూ అలా చేయగూడదనుకొన్నాడు. నరసయ్యపంతులుమీద పగపట్టినందుకు సిగ్గుపడి ఎంతో విచారించాడు. కాని నరసయ్యపంతులు అప్పటికే, జైళ్ళలోపడి మగ్గిమగ్గి, శవంలా తయారయి స్వతంత్రం రాకముందే చనిపోయాడు.

కాని, మళ్ళీ అలాంటి పనే చేయక తప్పిందికాదు సంజీవయ్యకి. 1949లో మొదటిసారిగా అతను మనిషిని నిలువునా కాల్చి చంపాడు. ఆ సంగతి చెప్పి యిప్పటికీ కంట తడిపెట్టుకుంటాడతను. అయితే యీమారు కేవలం పొట్టకూటికోసం చేశానంటాడు.

క్రమంగా మిగిలిన ఆడపిల్లలకీ, యిద్దరు మొగపిల్లలకీ పెళ్లిళ్లుచేసి పంపేశాడు సంజీవయ్య.

అతను 1951 ఆగస్టు 10వ తేదీన రిటైరయ్యాడు. రిటైరయ్యేనాటికి యింట్లో శేరు బియ్యం లేవు. సరిగ్గా ముప్ఫయ్యయిదేళ్ళనాడు తనే స్థితిలో వుద్యోగంలో చేరాడో అదే స్థితిలో రిటైరయ్యాడు. ఆనాడు తనకు తల్లి ఉండేది. ఆమె లేదిప్పుడు, ఆమె బదులు భార్య ఉంది. ఆరోజున యీపిల్లలెవ్వరూలేరు. యీరోజునా ఆపిల్లలంతా

రెక్కలొచ్చిఎవరిబ్రతుకువాళ్లు బ్రతుకుతున్నారు.

1953, నవంబరు 22 వ తేదీ సాయంకాలం 4-30 కి ఆకాశంలో దట్టంగా మేఘాలు కమ్ముకోలేదు. ఘోరమైన తుఫాను వీచడంలేదు. సంజీవయ్య సోడా కొట్టబోతూ, "అమ్మా" అని అరిచి శాశ్వతంగా కన్నుమూశాడు.

ఆదేజీవం, సరిగ్గా 59 సంవత్సరాలా,తొమ్మిది నెలలా, తొమ్మిది రోజులక్రితం అస్పష్టంగా "అమ్మా" అని అరిచింది! అయితే ఆ శరీరం ఆనాడు నవనవలాడుతూ, ఎంతో ఉత్సాహాన్నీ, ఎంతో చైతన్యాన్నీ సూచిస్తూ, "అమ్మా, యీ జీవితమంటే ఏమిటో తెలుసుకోనీయి..."అంది. ఆదేశరీరం యీనాడు ముడుతలు పడిపోయి ఏదో బాధనీ, ఏదో వైరాగ్యాన్నీ సూచిస్తూ,... "జీవితమంటే ఏమిటో తెలుసుకొన్నాను. యిక నన్ను తీసుకుపో అమ్మా" అంది.

# భరతవాక్యం

"బాలగంగాధర తిలక్"

సుందర స్వప్నాల స్వర్గాల మేడమెట్లనుండి
వాస్తవికతా శిథిల బధిరరుధిర కూపానికి
హఠాత్పతితుడనైన నాకు తెలుసు
అల్పమని నీవు అల్లిన గొలుసు.

మానవుడై నీవు చాచిన ప్రేమైక హస్తాన్ని
దానవుడై వాడు నరికిన చరిత్ర సమస్తాన్ని
పొంచి చూచిన నాకు తెలుసు
వంచితమని మానవ మనస్సు!

నీ నిరంతరతపస్సు ప్రసరించిన విద్యుదావేశతంత్రులు తగిలి,రగిలి,
నీ పాత తాటియాకుల ఇల్లు తగులబడి, బూడిదమిగిలి
నిలువ నీడలేని నిన్ను నాకుతెలుసు.
నీ మీదకే గురిపెట్టబడింది విధి ధనుస్సు.

కాదు ఇది నీ దేవీ పూజాపీఠ మమర్చిన శుభ్రగృహాంగణము
పెద్దపులులు కొండచిలువ తెలుగులు తిరిగే మహారణ్యము
ఒంటరిగాడ వనినాకు తెలుసు.
అందుకే వీళ్ళకింత అలుసు.

స్వార్థం, ద్వేషం, క్రౌర్యం వినా జీవితం లేదసలు
నాగరికత బండరాతి కొసతగిలి చిల్లుపడింది నీ నొసలు
గాయం మానదని నాకు తెలుసు
గేయం యిక ఎవ్వరూ వినరని నాకు తెలుసు.

ఇంతవరకు సత్యశాంతి సౌందర్య సంగీత గీత మాలపించావని
ఇపుడింకవ్యథాచిహ్నితమైన నీ కనులకింద నలుపుచార చెరగదని
నీలాంటివాణ్ణి నాకు తెలుసు
నిద్రలోనే కలలకి సొగసు.